www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 మార్చి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఆర్అండ్‌బి శాఖ కార్యదర్శికి స్వాగతం

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీ పిఎస్ ప్రద్యుమ్నను జిల్లా కలెక్టర్ శ్రీ కేవీఎన్ చక్రధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నగరంలోని ఆర్అండ్ బి అతిథి గృహానికి విచ్చేసిన పిఎస్ ప్రద్యుమ్నకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఆర్ అండ్ బి ఎస్ఈ గంగాధర్, నేషనల్ హైవేస్ పిడి గోవర్ధన, డిటిసి చందర్, ఆర్టీసి ఆర్ఎం శేషయ్య, ఆర్ అండ్ బి ఈఈ రామారావు, జనేయులు, డిఇ వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.

స్వాగతం పలుకుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

వైసిపికి ఓటమి భయం..!

తూర్పు రాయలసీమ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అధికారపార్టీకి ఓటమి భయం పట్టుకుంది..ఎలాగైనా ఆ స్థానాలు దక్కించుకోడానికి అనేక అక్రమాలకు పాల్పడుతుంది..ఓటర్లకు తాయిలాలు, విందులిచ్చి మభ్యపెడుతోంది..ఓటర్ల జాబితాలో తప్పుల తడకలున్నాయి.. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో వద్దని ఎన్నికల సంఘం ఆదేశించినా అక్కడక్కడా వాలంటీర్లు రాజకీయ నేతలుగా వ్యవహరిస్తున్నారు..గ్రామాల్లో అధికారపార్టీ నేతలు ఉపాధ్యాయులను బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం జోక్యం చేసుకొని ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాల్సిన అవసరం ఉంది..

- ఓటర్లకు తాయిలాలు పంపిణీ
- జాబితా తప్పుల తడక
- గ్రామాల్లో నేతల బెదిరింపులు
- అధికారపార్టీ అక్రమాలు

కావలిలో ఎంఎల్ఎ విందు సమావేశం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

తూర్పు రాయలసీమ ఎన్నికలను అధికార వైసిపి 2024 ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా చూస్తుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే అసెంబ్లీ ఎన్నికలకు ఈ గెలుపును చూపించాలని చూస్తున్నారు. మంత్రులు, ఎంపి, ఎంఎల్ఎలు కింద స్థాయి నేతలు పెద్ద ఎత్తున ఎన్నికల్లో బాగస్వామ్యులు అవుతున్నారు. ఈనెల 13న ఎన్నికల నిర్వాహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే సమయంలో గతంలో ఎన్నడూ లేనంతగా అధికారపార్టీ నేతలు ఓటర్లను సాధారణ ఎన్నికల వలే ప్రలోభాలకు గురిచేస్తున్నారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులపై గురిపెట్టారు. ఈ ఎన్నికల్లో ప్రయివేటు ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించారు. ఇదే అదునుగా భావించిన అదికారపార్టీ నేతలు అనేక మంది అనర్హులకు ఓటు హక్కు కల్పించినట్లు తెలుస్తోంది. పదో తరగతి పాస్‌కాని వారికి ఓట్లు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు పల్లెలు, పట్టణాల్లో వాలంటీర్లు జాబితా పట్టుకొని వైసిపి ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఓటర్లను చేర్పించారు. అ సమయంలో నగదు ఇస్తారని ప్రలోభ పెట్టారు. ఇప్పుడు ఆ ఓటర్లు వద్దకు వెళ్లి వైసిపికి ఓటు వేయాలని కోరుతున్నారు. మూడు దఫాలుగా పిడిఎఫ్ అభ్యర్థులే ఇక్కడ నుంచి విజయం సాధిస్తున్నారు. వారికి బలమైన ఓటింగ్ ఉంది. ఓడిపో తామని రిపోర్టు రావడంతో వైసిపి అధిష్టానం కూడా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. పట్టణాలు, పల్లెల్లో అధికా రపార్టీ నేతలు ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. నేరుగా పాఠశాలకు వెళ్లి వైసిపి అభ్యర్థులను ఓట్లు వేయా లని, మళ్లీ తామే అధికారంలోకి వస్తామని చెబుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ ఉద్యో గులు, ఉపాధ్యాయులు, గ్రా డ్యుయేట్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనిపిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారపార్టీ పావులు కదుపుతోంది..



ఉపాధ్యాయులకు గిఫ్ట్ పంపిణి చేస్తున్న దృశ్యం

ఓటర్లను మభ్యపెడుతున్నారు..!

తూర్పు రాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి అధికారపార్టీ నేతలు డబ్బులు పంపిణీకి తెర లేపారని తెలుస్తోంది. ఉపాధ్యాయ ఓటర్లకు రూ.5 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఉదయగిరి, కావలి, నియోజకవర్గాల తోపాటు ఇతర నియోజకవర్గాల్లో గురవారం పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. గ్రాడ్యుయేట్ ఓటర్లకు రూ.2 చొప్పున ఇస్తున్నట్లు తెలుస్తోంది. వైసిపి అధిష్టానం అత్యధిక భాగం ఖర్చులు పెడుతుండగా, అభ్యర్థులు సైతం సొంత నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయుల ఓటర్లకు గిఫ్ట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ప్రవేటు ఉపాధ్యాయులు, దొంగ ఓటర్లపై దృష్టిపెట్టినట్లు సమాచారం. విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఓ ఉన్నతాదికారి పర్యవేక్షణలో ఓటర్ల పంపిణీలు జరిగినట్లు తెలిసింది. కావలిలో విందు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కొన్ని చోట్ల ప్రతిఘటించినట్లు తెలిసింది. సమయం లేకపోవడంతో అధికారపార్టీ నేతలు ప్రలోభాలతో చెలరేగి పోతున్నారు. ఎన్నికల కోడ్‌ను పట్టించు కోవడం లేదు. జాతీయ నేతలకు ముసు గులు వేసిన అధికారులు జగన్, వైఎస్ఆర్ బొమ్మలను మాత్రం వదిలేశారు. గాంధీబొమ్మ వద్ద వైఎస్ జగన్ ప్లెక్సీలు దర్శనమి స్తున్నాయి. రేషన్ వాహనాలపై నున్న ముఖ్య మంత్రి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మల తోనే తిప్పుతున్నారు. పదో తేదీ వస్తున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల రేషన్ ఇవ్వకుండా చిన్నగా ప్రచార వాహ నాలుగా తిప్పుతున్నారు. ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ఎన్నికలు నిర్వహణ చేయా ల్సి ఉంది. అదికారపార్టీ అక్రమాలకు అడ్డకట్టవేయాల్సి ఉంది..

కట్టుదిట్టంగా ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ చక్రధర్‌బాబు

ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల విధులను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు పేర్కొన్నారు. జిల్లాలో ఈ నెల 13వ తేదీన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం నగరంలోని విఆర్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ,ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్లకు సంబంధించిన పిఓలకు, ఏపీఓలకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇసి నియమావళి పై రూపొంది ంచిన మాన్యువల్ ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని పూర్తి అవగాహనను ఏర్పర్చు కోవాలన్నారు. కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, కావలి ఆత్మకూరు, ఆర్డీఓ లు శీనా నాయక్, కరుణకుమారి, నుడా వీసీ,నుడా విసి బాపిరెడ్డి, డిఆర్డీఏ, డ్వామా పిడి లు సాంబశివారెడ్డి, వెంకట్రావు, ఎన్నికల విధులకు హాజరయ్యే పిఓలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సేకరించి డివిజనులకు పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి కెవిఎన్ చక్రధర్ బాబు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం వెలగపూడి నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సి.ఈ. ఓ) ముఖేష్ కుమార్ మీనా పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి నియోజకవర్గాల ఎన్నికల ఏర్పాట్లపై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సమయం ఎక్కువ లేనందున అందుకోసం కావలసిన పేపర్ సీల్లు, స్కెచ్ పెన్నులు, ఇండేలిబుల్ సిరా సీసాలు తదితర ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, ప్యాకింగ్ సామాగ్రిని వెంటనే సమకూర్చుకోవాలన్నారు. ఎంఎల్‌సి పోలింగ్ నిర్వహణకు అవసరమైన 169 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓటర్ స్లిప్పులు పంపిణీ కార్యక్రమం పూర్తి చేశామని అందుకు సంబంధించిన నివేదిక సాయంత్రం అందజేస్తామన్నారు.వీడియో జిల్లా నుంచి సంయుక్త కలెక్టర్ రోనంకి కూర్మనాద్, ఏఆర్ఓ- డీఆర్వో వెంకటనారాయణమ్మ, కందుకూరు సబ్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు ఏ మలోల, శీనా నాయక్ ,కరుణకుమారి, నోడల్ అధికారి ప్రేమ్ కుమార్ తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ

జిల్లాలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి వెబ్ కాస్టింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు, ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి వెబ్ కాస్టింగ్ ప్రక్రియ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు పాల్గొని మాట్లాడుతూ, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన వెబ్ కాస్టింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకొని పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, వెబ్ కాస్టింగ్ నిర్వహణ నోడల్ అధికారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ రాజశేఖర్, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యద ర్శులు తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను సూచించిన గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. స్థానిక ఎసి నగర్ 10, 11, 14 వార్డుల సచివాలయాలను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని వివిధ రికార్డులను పరిశీలించారు. ఆస్థి పన్ను, కుళాయి, డ్రైనేజ్ పన్నుల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు ఈనెల 24 వ తేదీ లోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. రీ సర్వే డి.టి అబ్దుల్, ఆర్.ఐ కష్ణంరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - లింగసముద్రం : విద్యార్థులు పరీక్షల సమయంలో బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మోడల్ స్కూల్ తల్లిదండ్రుల కమిటీ సభ్యులు కుమ్మిత ఓబులురెడ్డి చెప్పారు. గురువారం తిమ్మారెడ్డి పాలెం ఎపి మోడల్ స్కూల్లో సరస్వతి దేవి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులు సాధించి స్కూల్‌కు మంచి పేరు తీసుకరావాలన్నారు. ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలను విజయవంతంగా రాయాలన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు కుమ్మిత ఓబులురెడ్డి పరీక్షలకు కావాల్సిన అట్టలు, పెన్నులు, ఇతర సామాగ్రిలను సొంత ఖర్చులతో అందజేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హాఫ్తార్ విద్యా ర్థులకు పరీక్షల సామాగ్రిని అందజేసిన ఓబులురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పరీక్షల సామగ్రి అందజేస్తున్న ఓబుల్‌రెడ్డి

ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి-కందుకూరు :ఉలవపాడు మండలం చాకిచర్లలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాలకు కందుకూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండో శాఖ వారి ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. సామాజిక బాధ్య తలో భాగంగా ఒంగోలు రీజనల్ అధికారి అరుణ సజిత ఆధ్వర్యంలో బుధవారం 12 సీలింగ్ ఫ్యాన్లు ఆయా వసతి గృహాల వార్డెన్లకు అందించారు. జరిగిన కార్యక్రమాలకు బ్యాంకు చీఫ్ మేనేజర్ హితేంద్ర అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ధేశం చుకొని, ఆ మేరకు ఇప్పటినుండే ప్రణాళికాబద్ధంగా చదువు కోవాలని సూచించారు. బ్రాంచి మేనేజర్ అమూల్య పాల్గొన్నారు.

విద్యార్థుల విహార యాత్ర

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరులోని శ్రీ సంస్కృతి ఉన్నత పాఠశాలకు చెందిన ప్రైమరీ విద్యార్థులు గురువారం రామాయపట్నం బీచ్‌కి విహారయాత్రకు వెళ్లారు. లైట్ హౌస్ ను సందర్శించి దాని ఉపయోగాలు గురించి టీచర్లను అడిగి తెలుసకున్నారు. బంకిగ్‌హమ్ కాలువను చూపించి దానిని బ్రిటిష్ వారు ఎలా రవాణాకు ఉపయోగించుకున్నారో తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మన్నెం ఎల్లయ్య నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పువ్వాడి శ్రీనివాసులు, ఆకడమిక్ డీన్ టి మల్లికార్జునరావు, ఎట రబ్బాని, పీఈటీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగబోవు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ కు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మనాథ్ తెలిపారు. గురువారం జేసి చాంబర్ లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా ఇంటర్ పరీక్షా ఏర్పాట్ల పై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారి అధికారి టి. వర ప్రసాద్ రావు వివరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 52903 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. ఇందుకోసం జిల్లాలో 95 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 4 ఫ్లయింగ్ స్కాడ్ లను, 5 సిటింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేసామన్నారు. డి ఎస్ పి గాంధీ, నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యుటీ కమీషనర్ చెన్నుడు, ఆర్ టి సి డిపో మేనేజర్ శివకేష్, ప్రిన్సిపాల్స్ వేణుగోపాల్, దీనదయాళ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలలో తనిఖీ

ప్రజాశక్తి -గుడ్లూరు : ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా గుడ్లూరులో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను కందుకూరు డిఎస్‌పి కండే శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్ట బద్రులు, ఉపాధ్యా యులకు సంబంధించిన మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలిం చారు. అక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం : కలెక్టర్

నెల్లూరు :ఈనెల 14న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే (జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం) ను విజయవంతం చేయాలని, 1 నుంచి 19 సంవత్సరాలు మధ్య వయసు గల ప్రతి ఒక్కరూ నులిపురుగుల మాత్రలను వేసుకునేలా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె వీఎన్ చక్రధర్ బాబు ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డీ వార్మింగ్ డే కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెం డజోల్ మాత్రలు అందించాలన్నారు. అనంతరం డీ వార్మింగ్ డే పోస్టర్లను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. జడ్‌పి సిఈఓ చిరంజీవి, ఐసిడిఎస్ పిడి సౌజన్య, సమగ్ర శిక్ష పిఓ ఉషారాణి, ఆర్ ఐ ఓ వరప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గా భవాని, ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్ శిద్ధా నాయక్, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి..!

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు, ఎపి రైతుసంఘం నాయకులు ప్రచారం చేస్తున్నారు. మండలంలో ముమ్మర ప్రచారం సాగించారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ పర్యటించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లను కలిసి పిడిఎఫ్ ప్రాధాన్యతను గురించి వివరిస్తున్నారు. బుధవారం రాత్రి బడేవారిపాలెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు జివిబి కుమార్, నల్ల మోతు శ్రీహరి, ఎస్‌డి గౌస్‌బాష, పత్రి భాస్కరరావు, ఎస్ అరుణకుమార్ పాల్గొన్నారు.

ఉలవపాడు : ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గురువారం మండలంలోని ఆత్మకూరులో సిఐటియు జిల్లా నాయకులు జీవీబీకుమార్, సిఐటియు ఉలవపాడు మండల అధ్యక్ష కార్యదర్శులు వాకా.లతా రెడ్డి, ఎస్.డి గౌస్ బాషా ప్రచారం చేశారు.

వలేటివారిపాలెం మండలంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రపంచ కిడ్నీ దినోత్సవంలో 'మెడికవర్' వైద్యులు

ప్రజాశక్తి-నెల్లూరు

చక్కెర, రక్తపోటు, ఊభకాయం వంటి అనారోగ్య సమస్యలతో బాదపడేవారు, అధికంగా పెయిన్ కిల్లర్లు వినియోగించే వారు కిడ్నీ వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి, జాగ్రత్తలు తీసుకోవాలని మెడికవర్ హాస్పిటల్స్ యూరాలజిస్టులు డాక్టర్లు హెచ్చరించారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా మెడి కవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యనిపుణులు మాట్లాడుతూ ప్రస్తుతం కిడ్ని సంబంధింత వ్యాధులు విస్తరిస్తున్న తీరు పట్ల డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. 48 ఏళ్ల వయసు దాటిన తర్వాత ప్రతి ఒక్కరు కిడ్నీ సంబంధిత క్రియేటిన్ ,యూరిన్, అల్ట్రా సౌండ్ పరీక్షలతో పాటు సీరం టెస్ట్ కూడా చేయించుకోవాలన్నారు.వైద్య విధానంలో ప్రస్తుతం వస్తున్న మార్పుల వల్ల ప్రతి వ్యాధిని ముందుగా గుర్తించే అవకాశం ఉందని అందుకు సంబంధించిన పరీక్షలు అన్ని మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని, అలాగే ఇక్కడ అత్యంత అనుభవం కలిగిన యూరాలజీ వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని, ప్రతి ఒక్కరు ముందు జాగ్రత్తగా కిడ్నీ పరీక్షలు చేయించుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కిడ్నీ వ్యాధులను తరిమికొట్టే చర్యల్లో భాగంగా నాలుగు వేల రూపాయల విలువైన ప్రత్యేక కిడ్నీ చెకప్ ప్యాకేజీని 699 రూపాయలకే అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు . మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ తన ఆస్పత్రి ప్రవేశపెట్టిన కిడ్నీ పరీక్షల ప్రత్యేక ప్యాకేజీని నెల్లూరు జిల్లా పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు .కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం డాక్టర్ మాధవ దేశాయ్, డాక్టర్ సురేంద్ర కుమార్ యూరాలజీ విభాగం డాక్టర్ యువరాజు, డాక్టర్ గోకుల్, లు పాల్గొని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంకా ఈ సమావేశంలో ఓటి విభాగ సిబ్బందిని, డయాలసిస్ విభాగానికి చెందిన సిబ్బందిని సన్మానించారు . హెచ్ఓడిలు, పిఆర్ఓ చందు వర్మ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మెడికవర్‌లో..

'నారాయణ'లో...

బరువు తగ్గించే ఆహారాల వల్ల కిడ్నీల ఆరోగ్యం పై ప్రభావం చూపే అవకాశం ఉందని నారాయణ హాస్పిటల్ నెఫ్రాలజి విభాగాధిపతి డావ కె. ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ కిడ్నీ వ్యాధి దినోత్సవం సందర్భంగా నారాయణ హాస్పిటల్లోని డావ బి.సి. రాయ్ లెక్చర్ గ్యాలరీ నందు కిడ్నీ వ్యాధుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కె. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 90 శాతం కిడ్నీ వ్యాధులలో ఎలాంటి లక్షణాలు కనిపించడంలేదన్నారు. ఇటీవల తాజా అధ్యయనంలో ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ వ్యాధిగ్రస్తులు అవుతున్నారంటే అందుకు ప్రధాన కారణం జీవనశైలి అన్నారు. ఈ జీవనశైలిలో సరైన ఆహారం మరీ ముఖ్యంగా జింక్ఫుడ్, ప్యాకింగ్ ఫుడ్ తాగేనీరు కారణాలౌతున్నాయ న్నారు. తాగే నీటి విషయంలోనూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన స్వచ్ఛమైన నీరు తీసుకోవాల న్నారు. కిడ్నీ ఆరోగ్యం పై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, ఆహార నియమాల గురించి, వ్యాయామం తదితర అంశాలతో కూడిన విశ్లేషణను ఈ అవగాహన సదస్సులో ప్రదర్శించారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ వ్యాధి దినోత్సవం సందర్భంగా కిడ్నీల ఆరోగ్యం కోసం మార్చి 9వ తేది నుంచి మార్చి 31వ తేది వరకు సూపర్ స్పెషలిస్టచే ఉచిత వైద్య సలహాలు అందజేస్తున్నామన్నారు. వైద్యులు సూచించిన పరీక్షల పై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకూ సుమారు 115కు పైగా కిడ్నీ మార్పిడీలు విజయవంతంగా చేసిన ఘనత నారాయణ హాస్పిటల్ నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. ప్రవీణ్ కుమార్ కే దక్కుతుందన్నారు.నారాయణ హాస్పిటల్ ఏజిఎం భాస్కర్రెడ్డి మాట్లాడారు. నెఫ్రాలజిస్ట్ డావ ఎస్. రాఘవేంద్ర పాల్గొన్నారు.

నారాయణలో...

సులోచనకు పురస్కారం

ప్రజాశక్తి -కందుకూరు :ప్రకాశం జిల్లా చెరుకూరు యుపి స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మంగులూరి సులోచనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శ్రీ రామ సాయిబాబా ప్రతిభా పురస్కారం గురువారం అందజేశారు. ఈ పురస్కారాన్ని శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు చేతుల మీదుగా అందజేశారు. కేశవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తినే కాకుండా అమ్మ వెల్ఫేర్ సొసైటీ ద్వారా సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు, అమ్మ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు బి.వి.రమణ చేస్తున్న కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉపాధ్యాయిని సులోచనకు ఈ ప్రతిభ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అమ్మ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు బి.వి.రమణ, చీదెండ్ల కష్ణ పాల్గొన్నారు.

టీచర్ సులోచనకు ప్రతిభా పురస్కారం అందజేస్తున్న దృశ్యం

'ఇంటూరి'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా ఇంటూరి నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ఐఎన్ఆర్ క్యాంపు కార్యాలయంలో పలువురు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, యస్.సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, వలేటివారిపాలెం మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి గురజాల బెంజిమెన్, నెల్లూరు పార్లమెంటు ఎస్‌సిసెల్ అధికార ప్రతినిధి అంగులూరి చిన్న కొండయ్య, కందుకూరు మండలం యస్.సి సెల్ అధ్యక్షులు దారా శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు :పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న 26వ పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు గురువారం ప్రారంభం అయ్యాయని 26వ వేలం కేంద్రం ఏఎస్ చైన్ రామ్ మీనా తెలిపారు. మొదటి రోజు పొన్నలూరు మండలం తిమ్మపాలెం నుండి 27 బేళ్లను రైతులు వేలానికి తీసుకొచ్చారు. వేలానికి కేజీ రూ.200 చొప్పున కొనుగోలు చేశారు. వేలం నిర్వహణ ఆధికారి డి వేణుగోపాల్, మేనేజర్ ప్రొడక్షన్, రిజినల్ మేనేజర్ ఇన్‌ఛార్జి ఎం క్రిష్ణ శ్రీ పూజా కార్యక్రమంలో పాల్గొని తరువాత వేలం ప్రక్రియను ప్రారంభించారు. డి వేణు గోపాల్ మాట్లాడుతూ వర్షం కారణంగా పొగాకు పంటలు దెబ్బతిన్నాయని, రైతులు మరల పొగాకు సాగుచేసుకొని తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. పండించిన పొగాకును సరిగా గ్రేడ్ చేసుకొని వేలానికి తీసుకురావాలని సూచించారు. ప్రొడక్షన్ మేనేజర్ ఎం క్రిష్ణ శ్రీ రైతులు గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని సూచించారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూర్‌లోని శ్రీచైతన్య విద్యా సంస్థ ప్రిన్సిపల్ బి సురేష్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎలా రాయాలి అనే దానిపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావ ద్దని సూచించారు. అనంతరం స్కూల్ స్టాఫ్ బి.వి రమణను సన్మానించారు.

తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు :టిడిపి కార్యకర్తలు, నిరుపేదలైన ముగ్గురు వీధి వ్యాపారులకు, కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం తోపుడుబండ్లు అందజేశారు. వలేటివారిపాలెం మండలం వలేటివారిపాలెం గ్రామానికి చెందిన షేక్ చిన్నఫరీద్, లింగసముద్రం మండలం చినపవని గ్రామానికి చెందిన కుందుర్తి వేణు, పట్టణంలోని 19వ వార్డు గోకరాజు పాలెంకు చెందిన దండే వెంకటేశ్వర్లుకు ఇంటూరి నాగేశ్వరరావు తోపుడుబండ్లు అందించారు. పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాల్ రావు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్, మహర్షి శ్రీను, షేక్ సలాం ఉన్నారు.

ఘనంగా అన్నదానం

నెల్లూరు :రంగనాథుని రథోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన వారికి సంతపేట టింబర్ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎశ్రీనివాసులు, జి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. టింబర్ ముఠా కార్మికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వ్యాపారుల సంఘం నాయకులు మరియు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె రవి, యన్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, అంజి, ఆంజనేయులు, చంద్రయ్య, శివ, లక్ష్మీనారాయణ, కష్ణ పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-నెల్లూరుఆదిత్య విద్యాసంస్థల అధినేత కీర్తిశేషులు శ్రీ ఆచార్య ఆదిత్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల, నెల్లూరు వారి సహకారంతో మెగా రక్తదాన శిబిరం కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించడం జరిగింది. రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు చిరసాని కోటి రెడ్డి మాట్లాడుతూ ఆచార్య ఆదిత్య మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి అని, నిరంతరంగా సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేవారని, చాలా నిరాడంబరంగా ఉండే వారిని ఆయన గొప్పతనాన్ని వివరించారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ మంచికంటి కష్టారెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఆరోగ్యంగా ఉన్న 18 నుండి 60 సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరూ చేయవచ్చు, ఈ రోజుల్లో రక్తదానం చేస్తామని ముందుకు వచ్చే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఒక పూర్తి యూనిట్ రక్తం (300–450 మిల్లీలీటర్) రక్తాన్ని మూడు భాగాలుగా ఉపయోగించి ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఉదాహరణకు యూనిట్ రక్తంలోని రక్త కణాలను ఒక రక్తహీనతతో ఉన్న వ్యక్తికి లేదా ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ప్లాస్మా అనే ద్రవాన్ని హిమోఫిలియా అనే బ్లీడింగ్ డిజార్డర్ వ్యాధితోఉన్న వ్యక్తికి ప్లేట్లెట్స్ ను డెంగీ వంటి ప్రాణాంతక జ్వరంతో ఉన్న వ్యక్తికి లేదా త్రోంబోసైటోతో ఉన్న వ్యక్తికి ఇవ్వడం ద్వారా మీరు చేసే ఒక్క యూనిట్ రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవలసిందిగా, రక్తదానం గొప్పతనాన్ని చెప్పారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాల కో–ఆర్డినేటర్ కె.అంకయ్య, ఏ.కార్తీక్ వర్మ, జె.నవ్యభారతి చెప్పారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.పుల్లయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దృశ్యం

పిడిఎఫ్ ఎంఎల్సి అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-కావలి:కావలి ఇందిరానగర్, తదితర ప్రాంతాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని గురువారం డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ఎంఎల్సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దల సభలో నిరుద్యోగులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్, ఉపాధ్యాయ, కార్మిక వర్గ, ప్రయివేట్ విద్యాసంస్థల లెక్చరర్ ఉపాధ్యాయుల, తరుపున వ్యక్తంగా ఉండే అభ్యర్థిపిడిఎఫ్ తరఫున పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పోక్కిరెడ్డి బాబు రెడ్డికి మీ మొదటి ప్రధాన ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, బోగిశెట్టి కృష్ణయ్య, జి.మధుసూదన్‌రావు, ఎస్.కె అమీర్ బాషా, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న దృశ్యం

అనంతసాగరం

మండలం సోమశిల ఎస్సీ కాలనీలో జనసేన, పిడిఎఫ్ సంయుక్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు వేణు మాట్లాడుతూ జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ కు మద్దతు తెలిపిన సందర్భంగా పిడిఎఫ్ అభ్యర్థులు వెంకటేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులు అను కోరారు. మండలంలో తెలిసారిగా సోమశిల గ్రామంలో జనసేన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పిడిఎఫ్ నాయకులు మాట్లాడుతూ మండలంలోని జనసేన నాయకులు తో కలిసి పని చేయడం ఆనందంగా ఉందని అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం, నాగులవరం వాస్తవ్యులు కాంగ్రెస్ గంగినాయుడు కుమారుడు కాంగ్రెస్ సతీష్ గురువారం మంగమూరు క్రాస్ రోడ్డు వద్దన ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి 15వేల రూపాయల విలువ చేసే నిత్యావసర వస్తువులు కావలి ఎక్సైజ్ సిఐ, కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వితరణ గా అందజేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ సతీష్ నాయుడు ఇలాంటి ఆనాథలను గుర్తించి వారికి సహాయం అందించడం హర్షనీయమని ప్రశంసించారు, రెండు సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా అందజేయడం సామాన్యమైన విషయం కాదని సతీష్ నాయుడు లాంటి వారు సమాజానికి అవసరం అన్నారు.ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమన్నారు. ఆయన ప్రతినెలా 1వ తేదీ తాము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తి కి ప్రత్యేకంగా ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన జాగో వేదిక ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి, అంబేద్కర్ ఇండియా మిషన్ బోగోలు మండల కన్వీనర్ కాకి తిరుపతయ్య, పీట్ల ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న దాత

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పలు అపరిష్కృత సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్ల సంఘాల రాష్ట్రకమిటీ ఇచ్చిన దశవారీ పోరాటంలో భాగంగా గురువారం కావలితాలూకా రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కావలి ఆర్డిఒ, తహశీల్దార్, ట్రెజరీ కార్యాలయాల్లోని అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల రమణయ్య మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిలు, పిఆర్‌సి అమలు, డి.ఆర్.అరియర్సును సత్వరమే చెల్లించాలన్నారు. 11వ పిఆర్‌సి అరియర్సు వెంటనే చెల్లించాలన్నారు. 12వపేకమీషన్ ఏర్పాటు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ప్రతినెల 1వతేదీన పెన్షన్లు చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డులపై క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ అన్ని హస్పిటల్లలో సమస్య వాదులకు పరిష్కారం చర్యలు చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు తక్షణం చెల్లింపులు చేయ్యాలన్నారు.పెన్షనర్లకు నాన్‌పెన్షనరియల్ బెన్‌ఫిట్స్ సిపిఎస్‌ఎమ్‌ఎస్‌తో సంబంధం లేకుండా సంబంధిత ట్రెజరీలలోనే పూర్తి చేయునట్లు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న ఎంపిడిఒ, ఎంఎల్‌సిలకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు.ఈనెల 14వతేదీన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద తమ సమస్యల పరిష్కారంకోసం కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.కె.సాయి రాంసింగ్, కోశాధికారి యేమూరు వెంకయ్య,అసోసియేషన్ సెంటెడెంట్ రవికుమార్,తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

లారీలపై ప్రయాణికులు ఎక్కరాదు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:ఆత్మకూరు పురపాలక పరిధిలోని నెల్లూరు– ముంబై జాతీయ రహదారిపై గురువారం ఎస్ఐ శివ శంకర్ రావు వాహనాలు తనిఖీ చేశారు. ఆక్రమంలో అధిక లోడుతో వస్తున్న లారీపై ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న లారీని ఆపి ప్రయాణికులను , కూలీలను ఎక్కించుకోరాదని నేరమని లారీ డ్రైవర్లను హెచ్చరించారు. ఎవరైనా వాహనాల టాప్ పై ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణం లోని పలు సెంటర్లలో ద్విచక్ర వాహనాలు ఆపోలను ఆపి పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్, రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాన్ని ప్రారంభించారు. మొదటిరోజు 18 పొగాకుబేళ్ల ను వేలం కేంద్రానికి తీసుకువచ్చారు. ఐదు కంపెనీలు వేలంలో పాల్గొని అన్ని బేళ్లను కిలో 200 రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణా ధికారి రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు పొగాకు వైపు మొగ్గు చూపారన్నారు. గతంలో కంటే ఈ ఏడాది 1000 హెక్టార్లలో పొగాకు సాగు చేశారని తెలియజేశారు. రైతులకు పొగాకు బోర్డు6.2 మిలియన్ల పొగాకును పండించాలని సూచించగా 7 మిలియన్ల పొగాకు ఉత్పత్తిఅయ్యే అవకాశం ఉందన్నారు.మాండూస్ తుపాన్ ప్రభావంతో దెబ్బ తిన్న ప్రాంతాల్లో తిరిగి పొగాకు నాట్లు వేశారు. అలాంటి రైతులకు టొబాకో బోర్డు వడ్డీ లేని రుణాలు అందించిందన్నారు. గతంలో రైతులు వేలం కేంద్రాల్లో అమ్మిన పొగాకు నగదు 12రోజులకు రైతుల ఖాతాల్లో జమ అయ్యేది. ఈ ఏడాది వేలం కేంద్రంలో అమ్మిన పొగాకు నగదు 8రోజుల్లో రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. రిజిస్ట్రేషన్ లన్ని క్యాష్ లెస్ పేపర్ లెస్ చేయాలని అన్ని డిజిటలైజేషన్ చేస్తున్నారన్నారు. మార్కెట్లో ఏ రకం పొగాకును బయ్యర్లుకొనుగోలు చేస్తున్నారో ఆ రకం పొగాకు బేళ్లలో నెమ్ము వేడి లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం పొగాకు బోర్డు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు మూలి వెంగయ్య మాట్లాడుతూ పొగాకు వేలం ప్రారంభమైనా రైతులు ఆశించిన ధర రాలేదని బాధపడుతున్నా రన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. లేబర్ ఛార్జీలు ఎరువులు కట్టెల ధరలు పెరిగినప్పుడు బ్యారన్ కు రూ 8లక్షలు ఖర్చు అయిందని రైతులు తెలిపారు. రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంఎస్ స్వామినాథన్ రిపోర్టును అమలు చేస్తామని, చెబుతుంటారు. బ్యారన్‌కు పెట్టిన ఖర్చుకు అదనంగా 50శాతం(12లక్షలు)ఇవ్వాలన్నారు. మొదటి రకం రూ.250లు రెండవ రకం రూ.200లు మూడవరకం రూ.150లు పెడితేనే సగటు ధర రూ.200లు ఉంటుందన్నారు. ఈ ఏడాది ధరలు అనుకూలంగా ఉండేవిధంగా వేసి అన్నదాతను కాపాడాలని కోరారు.

పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న అధికారి

కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి

కావలి ఎం.ఎల్ఎ ఎంఎల్.సి ఓటర్లను ప్రలోభపెడుతు, బెదిరింపులకు పాల్పడుతున్న విషయాలపై, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా అధికార పార్టీకీ చేస్తున్న ఎన్నికల ప్రచారంపై జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కావలి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్‌రావుకి ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ కరవది భాస్కర్, సభ్యులు జ్యోతి బాబురావు, పసుపులేటి పెంచలయ్య(సీపీఎం), చింతాల వెంకట్రావు, పొబ్బ సాయి, ఎల్.లక్ష్మీరెడ్డిలు మాట్లాడారు. కావలి నియోజక వర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతుందన్నారు. స్వయంగా కావలి ఎంఎల్ఎనే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న సంఘటనలు ఉన్నాయన్నారు. మార్చి 8న కావలి ఎం.ఎల్.ఏ ఇంట్లో ఉపాధ్యాయ, ఆధ్యాపక, గ్రాడ్యుయేట్ ఓటర్లను పిలిపించి బెదిరింపులకు, ప్రలోభాలకు పాల్పడ్డా రన్నారు. వార్డు వాలంటీర్ల ద్వారా, సచివాలయ సిబ్బంది ద్వారా, కొంతమందికి ఎం..ఎల్..ఏనే స్వయంగా ఫోన్ చేసి పిలిపించా రన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా ఎం.ఎల్.ఏ ఇంటికి పోవాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. కావలి ఎం.ఎల్.ఎ అధికార దుర్వి నియోగానికి పాల్పడ్డా రన్నారు. ఎన్నికల నియమావళిని కూడా ఉల్లంఘిం చారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడతానని చేసిన ప్రమాణాన్ని స్వయంగా ఒక ప్రజాప్రతినిధే తుంగలో తొక్కడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయ డమే నన్నారు. చట్టాన్ని అగౌరపరచ డమేనని కనుక ఈ సంఘటనపై చర్యలు తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో దేవకుమార్, నాగార్జున, హఫీజ్, బి. వేణు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి

ప్రజాశక్తి-కావలి

స్థానిక జెడ్‌పి గర్ల్స్ హై స్కూల్లో మార్చి 8 సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో గురువారం సభను ఏర్పాటు చేశారు. ఈ సభకి ఇన్‌ఛార్జి హెచ్ఎం సీ. తనుజ అధ్యక్షత వహించారు. బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.హరి నారప రెడ్డి మాట్లాడుతూ మహిళల ఓటు హక్కు కోసం, పని పరిస్థితులలో మెరుగుదలకోసం, వేతనాల పెంపు కోసం దాదాపు 100 సంవత్సరాల క్రితం మహిళలు పోరాటం చేశారన్నారు,ఆ పోరాటాలు గుర్తుగానే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్య వర్గ సభ్యురాలు ఎల్ శ్యామల మాట్లాడుతూ 1910సంవత్సరంలో కామ్రేడ్ క్లారా జెట్కిన్ అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాట దినంగా మార్చి 8ని ప్రకటించిన నేపథ్యం మాట్లాడారు. మన దేశంలో మహిళలకు చదువు చెప్పిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే లాంటి ఇంకా ఎందరో త్యాగాలతో ఈ రోజున మనం ఈ మాత్రం అభివద్ధిలోనైనా ఉన్నామన్నారు. ఈ రోజున బాలికలు, మహిళలపై అత్యాచారాలు హత్యలు దాడులకు మూల కారణం మద్యం, డ్రగ్స్, సినిమా, టీవీ, సెల్ ఫోన్స్ కారణాలన్నారు. ఈ సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని, బాలికలు, మహిళలు హుందాగా, ఆత్మగౌరవంతో జీవించే హక్కుకై పోరాడుదామన్నారు . ఇంకా ఈ సభలో వాణి, సుకుమార్ టీచర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో హరికుమార్, ముని సుహాసిని, ఛాయాదేవి, భారతి, గౌసియా మేడమ్స్, హైమావతి, ఛాయా కుమారి టీచర్లు, యువజన నాయకులు పి. మోహనరావులు పాల్గొన్నారు.

సౌర్యశక్తితో మొబైల్ ఛార్జర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోవూరు: జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సౌర్యశక్తితో పనిచేసే కాయిన్ బెస్ డ్ మొబైల్ ఛార్జర్‌ను ఆవిష్కరించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్ కుమార్ మాట్లాడుతూ కేవలం ఒక్క రూపాయి నాణెం ఖర్చుతో మొబైల్ ఫోనును పూర్తిగా రీఛార్జ్ చేయడం ఈ ఉపకరణం ద్వారా సాధ్యమ వుతుందన్నారు. ఈ పరికరం సౌరశక్తితో పనిచేస్తుందని ఈ పరికరం వల్ల మరింత సామాజిక ప్రయోజనం కలుగుతుందన్నారు. కళాశాల కార్పొరేట్ సామాజిక బాధ్యతతో భాగంగా ఇలాంటి ఆవిష్కరణలు చేపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కార్యక్రమం అధికారి వై మురళీకష్ణ ఈ కార్యక్రమాన్ని పరిరక్షించారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు ఎల్ఐసి బ్రాంచ్ ఉద్యోగులు విద్యార్థులతో కలిసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళల అభివద్ధే దేశాభివద్ధికి దోహదపడుతుందని, పసి వయసులోనే పొదుపు చేయడం అవసరమని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పెన్సిళ్లు, రబ్బర్లు అందజేశారు. విద్యార్థులకు అరటిపండ్లు, బిస్కట్ పాకెట్లు, చాక్లెట్లు అందజేశారు. విద్యార్థులు విద్యతోనే ఉన్నతంగా జీవించాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఆత్మకూరు బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్, యూనియన్ అధ్యక్షులు శ్యాం, ప్రభాకర్, కార్యదర్శి ఏవి రమణయ్య, జి లక్ష్మీనారాయణ, ఆనంద్‌లు, బ్రాంచ్ మహిళా ప్రతినిధులు ఎస్ ప్రవీణ, ఎం. రమాదేవి, సౌజన్య, జయసుధ ,దామిని గాయత్రి పాల్గొ న్నారు.ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రరావు, ఉపాధ్యాయురాలు మాలకొండమ్మ,ఆ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు లక్కు కష్ణ ప్రసాద్, మహిళా దినోత్సవం గురించి వివరించారు.

నోట్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

సాయిబాబా గుడిలో వేడుకలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: పట్టణంలోని తూర్పు వీధిలో వెలసి ఉన్న శ్రీ సాయి బాబా మందిరం వద్ద సాయిబాబా సత్సంగ మహోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా నామోత్సవ కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు పద్మకు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా నరసరావుపేట లో కొవిద సహదయ ఫౌండేషన్ ఇండియా వారి కళాబంధు డాక్టర్ అనూహ్య రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రంగాలలో అంకితభావంతో కషి చేస్తున్న మహిళలను సావిత్రి బాయి పూలే ఆదర్శ మహిళ సేవా అవార్డు మెడల్ ప్రశంస పత్రంతో సత్కరించారు అందులో ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు దమ్ము పద్మమ్మ ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు కలెక్టర్ ఆధ్వర్యంలో అందుకున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి

నులిపురుగుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల టాస్క్ ఫోర్స్ కమిటీ మీటింగ్ మండల వైద్యాధికారిని డాక్టర్ సీమ తప్పం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను మింగవలెనని తెలిపారు. మండలంలో ఒక్క సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపల 10,117 మంది పిల్లలు ఉన్నారన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకి సగం మాత్ర 3 నుంచి 19 సంవత్సరాల లోపల పిల్లలందరికీ ఒక మాత్ర మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత స్కూల్ లోపల ఉన్న పిల్లలకు స్కూళ్లలోనూ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలకి అంగన్వాడీ కేంద్రంలోనూ జూనియర్ కాలేజీ పరిధిలో ఉన్న పిల్లలకు కాలేజీలో మాత్రలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మండలంలోని టీచర్లు, అంగన్వాడీ కార్య కర్తలు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరావు, మండల విద్యాశాఖ అధికారి జయంత్ బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో విద్యార్థినులు

క్రీడల్లో గంగపట్నం స్కూల్ టాప్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: ఇటీవల నరసాపురం పాఠశాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన 98వ కోవూరు నియోజకవర్గ గ్రిగ్ మెమోరియల్ క్రీడాపోటీలలో అన్నింటా విజయకేతనం ఎగురవేసిన గంగపట్నం పాఠశాల విద్యార్థులను, ఆ పాఠశాల పిఇటి ముజీర్ ను అభినందిస్తూ పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ క్రీడల్లో వ్యక్తిగత ఛాంపియన్ గా నిలిచిన పి. ఇందు ఐదు రకాల క్రీడల్లో మొదటి స్థానం సంపాదించి పాఠశాలకే గర్వకారణంగా నిలిచింది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు 72 పోటీలలో పాల్గొంటే అన్నింటిలో విజయాలు సాధించారు.అందులో 66 బంగారు పతకాలు కేవలం 3 రజతాలు, 3 కాంస్య పతకాలు ఉండటం క్రీడాల్లో గంగపట్నం పాఠశాల ప్రతిభకు అద్దం పడుతుంది.గంగపట్నం పాఠశాల వ్యక్తిగత ఛాంపియన్షిప్, పాఠశాల స్పోర్ట్స్ ఓవరల్ ఛాంపియన్షిప్, స్పోర్ట్స్, గేమ్స్ ఛాంపియన్షిప్ గంగపట్నం పాఠశాల సాధించడంలో ముఖ్య పాత్ర పోషించిన పిఇటి ముజీర్‌ను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినం దించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.గోపి, ప్రధానోపాధ్యాయులు కె. చలపతి, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన 'బొమ్మిరెడ్డి'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును ఆత్మకూరు పట్టణానికి చెందిన మాజీ జెడ్పి చైర్మన్ బొమ్మ రెడ్డి రాఘవేంద్ర రెడ్డి వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ కు విచ్చేసిన వెంకయ్య నాయుడును గురువారం బొమ్మిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆత్మకూరు పట్టణంలో తన తండ్రి మాజీ శాసనసభ్యులు బొమ్మిరెడ్డి సుందర రామిరెడ్డి విగ్రహావిష్కరణకు రావాలని ఆయనను కోరారు. ఆయన వెంట పలువురు ఆత్మకూరు నాయకులున్నారు.

రెండు బైక్‌లు ఢీ-ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మర్రిపాడు: నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై టొబాకో బోర్డు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది.పొగాకు వేలం కేంద్రంలోనికి వెళ్తున్న స్కూటరిస్టును మర్రిపాడు నుంచి నెల్లూరు వెళ్తున్న మరో బైక్‌ఢీ కొట్టింది.ఈ సంఘటనలో గాయపడ్డ ఇద్దరు క్షతగా త్రులను టోల్ ప్లాజా అంబులెన్సులో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

వైసిపికి బుద్ధిచెప్పాలి

ప్రజాశక్తి-కావలి: ఎంఎల్సి ఎన్నికల్లో వైసిపికి ఓటర్లు బుద్ధిచెప్పాలని కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పామూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలంటే వైసిపికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో దొంగ ఓట్లను వేసేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అలాంటి ఆలోచన ఎవరికైనా ఉంటే మానుకోవాలని, లేనిపక్షంలో కఠినమైన శిక్షలను వారు అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. కనీస అర్హత లేని ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ఎలా వచ్చాయో అర్థం కావడం లేదన్నారు. ఓటర్లను అభ్యర్థించే ప్రక్రియను మార్చి ఓటర్లను బెదిరించే ప్రక్రియను మన శాసనసభ్యులు మొదలుపెట్టారని దుయ్యబట్టారు.

గ్రామ ముఖద్వారం ఆవిష్కరణ

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి ముఖ ద్వారాన్ని ఆ ప్రాంతానికి చెందిన రావెళ్ల వెంకట రత్నం నిర్మించారు. గురువారం వేద పండితులు విటపు కుమారస్వామి నేతృత్వంలో పూజా కార్యక్రమ నడుమ ముఖద్వారాన్ని మాజీ మండల కన్వీనర్ గంగవరపు పుల్లయ్య ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు చుట్టుపక్క ప్రాంతాలవారు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD

O.S.NO. 1573 OF 2020

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Senior Manager (Law) ....Plaintiff

AND

Sri Chennur Sudhakar Reddy. S/o. Sri Ch. Radhakrishna Reddy,aged about 57 years,occ.:Business, Hotel Amaravathi, Opp; APSRTC Bus Stand. Skh By Pass Road, Naidupet. SPS Nellore District-524126,AP ...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.1.67,142-95 Ps (Rupees One lakh sixty seven thousand one hundred and forty two and paise ninety five only) together with subsequent interest@ 2.95% per month compounded monthly and service charges from date of suit till realisation and costs and the same stands posted to **14-03-2023** for your appearance in person or through duly appointed Advocate at **10-30** A.M and if you fail to so appear. the matter will be decided on merits, in your absence..

(BY ORDER OF THE COURT)

Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,West Prasanth Nagar Colony, Moosarambagh, Hyderabad-500 036

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 313 / 2022
O.S.No. 6 / 2019

భత్తల వెంకటయ్య – పిటిషనరు / వాది

Vs

కాపులూరి రాములు – రెస్పాండెంటు / ప్రతివాది

To,
కాపులూరి రాములు, S/o Late **ఐతన్న,** (పతంజలి ప్రొడక్ట్స్ సెల్లార్) R/o ఆత్మకూరు బస్టాండ్, జేమ్స్ గార్డెన్, D.No. 15/782. ప్రస్తుతం: R/o రాంజీనగర్, 3వ లైను, సాయిబాబా గుడి ఎదురు, D.No.CTS. 2/401, నెల్లూరు టౌన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై చూపిన ఫైనల్ డిక్రీ పిటిషన్‌లోని రెస్పాండెంటు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో నోటీసు నిమిత్తం **తే03-04-2023** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం గం॥ 10-30 గంటలకు** స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసింది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా :- 03-04-2023

ఇట్లు
వలేటి శ్రీధర నాయుడు, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, కందుకూరు.